కథానిక

# ఇల్లాలి సామర్థ్యం

యస్. ఆర్. వారణాశి

శర్మ మామగారివద్దనుంచి వచ్చిన ఉత్తరం చూసాడు. ఉత్తరం ఒక విధంగా అతనికి చాలా ఉత్సాహాన్ని ఇచ్చిందనే చెప్పాలి. రాబోయే 'సంక్రాంతి' పండుగకు మామగారు తన్ను ఆహ్వానించడం తనకు మనశ్శాంతి నిచ్చింది. సంక్రాంతి పండుగ తలుచుకుంటే గిఱ్ఱున భావపరంపరలు అతని మనస్సులో జెఱ్ఱులులా పరుగెత్తాయి. క్రిందటి పండుగనాటి మధురస్మృతులు ఒక్కసారిగా మనోదృక్పథానికి తట్టాయి.

అసలు శర్మ వివాహం చాల చిన్నతనంలోనే అయింది. అతను స్కూలుఫైనలు చదువుతూండగా ఎంతోమంది తన్ను చూడటానికి హైస్కూలుకు రావడం ఇప్పటికీ శర్మకు జ్ఞప్తే! రామారావుగార్కి శర్మ ఒక్కడే కుమారుడు. ఏదో రెండుపుట్లకు తక్కువ గాకుండా ఆయన స్వార్జితం ఉంది. గ్రామాధికారిగా ఆయన కలుగజేసుకోకుండా సక్రమంగా సెటిలు అయిన వ్యవహారం ఏమీ లేదనడంలో అతిశయోక్తికాదు. అందుకనే బాగా డబ్బు సంపాదించారుకూడా. చదివే చదువుకీ , చేసే వృత్తికీ సంబంధంలేని ఈ ప్రస్తుత విద్యావిధానం అంటే ఆయనకు సుతరామూ ఇష్టం ఉండేదికాదు. "వొద్దు వొద్దంటూంటే ఈ ఇంగ్లీషు చదువులో పెట్టావు. మెరకపొలం సిస్తు అంతా వాడిక్రిందనే అయిపోయింది. ఇంగ్లీషు చదువు అచ్చిరాదంటే విన్నావు!" అన్న కన్యాశుల్కంలో అగ్నిహోత్రావధానులు తంతు ఈయినిది. ఏ హంగుకు ఆ హంగు ఉండాలన్న మనస్తత్వం గల శర్మతల్లి సుందరమ్మగారి పట్టుదల వలన శర్మను ఇంగ్లీషు చదువులో పెట్టారు.

ఆడపిల్లలుగల రామారావుగారు మోయిలేని బరువు కట్నాలుఇచ్చి ఆడపిల్లల వివాహాలు దుంధుభిలు మ్రోగేలా చేసారు. దానితో ఆయన హోదా సొసైటీలో కరస్‌పాండింగుగా హెచ్చింది. అందుమూలానే గాబోలు శర్మ స్కూలుఫైనలు చదువుతూండగానే పెళ్ళిళ్ళ పేరయ్యలు జోళ్ళు అరిగేలా తిరుగుతూ, ఈగలులా రామారావుగారి ఇంటిచుట్టూ ముసిరేవారు. శర్మకు పెళ్ళిళ్ళ పేర్యయల ఆంతర్యం అట్టే తెలిసేది కాదు. కాని ప్రతిసారి ఎవరో ఒకరువచ్చి పాఠం జరుగుతూన్న పీరియడులో వచ్చి పిలుచుకొని వెళ్ళటం చికాకుగానే అనిపించేది ఆ యువక హృదయానికి.

కృష్ణశాస్త్రిగారు పెళ్ళిచూపులుకని చక్కా వచ్చారు ఒక శుభదినాన్ని ఆరోజు. ఆదివారం మూలాన్ని శర్మకు ఆటవిడుపు. నిజానికి శర్మ ఆ 'పెద్దమనిషి' రాక తన ఊరు రోడ్డు జంక్షనులో పసిగట్టాడు. పేరుకు తగ్గట్టు ఆయన పరమకృష్ణావతారమే. కాదంటే మొఖంలో కళ ఉట్టిపడుతూ ఉంటుంది. సైకిలుసీటుపై ఎక్కి పూర్తి పెడలింగు నేర్చుకుంటున్న శర్మను నిలువునా నిలవేసి, రామారావుగారిల్లు ఈవీధిలో నేనా అన్నారు శాస్త్రిగారు శర్మనుద్దేసించి "నన్ను ముట్టుకోకు నామాల కాకి" అన్న ధోరణిలో తనసైకిలు ఫీట్సు చేసుకుంటూ మబ్బులోని మెరుపులా మెరిసి మాయమయ్యాడు కోణంగి శర్మ.

శర్మ భోజనాలవేళకి అద్దె సైకిల్ షాపులో అప్పచెప్పి గృహోన్ముఖుడైనాడు. అప్పటికి ఇంటిలో హాలులో పెద్దలు కొందరు వెంచేసి, ఆంధ్రాలో రాబోయే భూసంస్కరణలు మొదలు ఆవడి కాంగ్రెసు తీర్మానమయిన నమూనాప్రభుత్వ పథకాలనుకూర్చి కూలంకషంగా చర్చించి పారేస్తున్నారు. వీళ్ళందరిని చూసేటప్పటికి, మాటినీ సినిమా చూసి బయట ఎండలోకి వస్తే, కళ్ళు మిరుమిట్లు గొల్పినట్లు అయింది శర్మకు. అంతలోనే అక్క చెప్పనే చెప్పింది. "ఏరా శర్మా, పెళ్ళిచూపులకు తణుకునుంచి ఎవరో నిన్ను చూట్టా

నికి వచ్చారురా. ఆ మాసిన గుడ్డలు విడచి, మంచివి వేసుకొని సిద్ధంగా ఉండు" అంది అక్కయ్య ఆడబడుచు పోజుపెట్టి.

"ఈ ఫాన్సీ డ్రెస్సులు వేయడం నావు చేత కాదు. నేను ఇలాగే దర్శనం ఇస్తాను" అన్నాడు శర్మ కోపంగా.

"ఇదేం చిత్రంరా నాయనా. బట్టలు మార్చు కోడానికి ఇంత రాద్ధాంతం దేనికిరా. ఊ,... త్వరగా మార్చుకో, అమ్మ వస్తే కూకలేస్తుంది" అంది అక్కయ్య ఆడబడుచు కట్నాలు ఏమి ముట్టచెప్పుతారో అని లోపల ఊహాగానం చేస్తూ. చేసేదిలేక, శర్మ ఊకొట్టాడు.

శర్మకు స్వతంత్రాభిప్రాయాలు ఉగ్గుపాలతో అలవడ్డాయి. ప్రతి పనిలో అతని ఒరిజినాలిటీ ప్రతిబింబిస్తూనే ఉంటుంది. శర్మకు చిరుప్రాయం లోనే వివాహంచేయ సంకల్పించిన తండ్రి యాటిట్యూడ్ కటువుగా అనిపించింది. నా పెళ్లికి ఈయనగారికి ఇంత తొందరేలా అన్నది ఒక క్వశ్చన్ మార్కుగానే ఈనాటికీ నిలచిపోయింది. పెళ్ళిచూపుల నిమిత్తార్థం విచ్చేసిన శాస్త్రిగారు తన్ను క్రాస్ ఎక్జామిన్ చేసాడు పెద్ద నేరస్తునిలా. శర్మ సమాధానాలు అన్నీ మొక్కుబడిగానే అని పించాయి శాస్త్రిగారికి.

"ఏమోయి పంతులూ. ఇట్లా వచ్చి నిలబడు నాయినా" అన్నారు కృష్ణశాస్త్రిగారు.

శర్మ వెళ్ళి ఆయనవద్ద నిలబడ్డాడు.

"సరిగా నుంచో" అంటూ దారంతో కొలత తీయడం మొదలెట్టారు.

"ఏమండోయి. ఇది నా పొడవు. ఇంతకంటె పొడవు కుదించి మదించినా, పెరగదూ-తరగదూ, సరేనా"? అన్నాడు శర్మ కటువుగా. హాలులో కూర్చున్న ఆడియన్సు అంతా ఒక్కసారిగా నవ్వారు. ఒక వారంరోజులు పెళ్ళి మంతనాలు, రాయబారాలు జోరుగా జరిగి చివరకు ఒక ఫుల్ స్టాప్‌కి వచ్చాయి పెళ్ళినిశ్చయంతో.

శారద అంటే శర్మ కుటుంబంలో అవ్యాజ ప్రేమ. శారద కుందనపు బొమ్మలా, సంపంగి పూవులా ఉంటుందని తన స్నేహితులతో కవితా వేశంలో వర్ణించేవాడు. ఆమె తన కళాదేవతగా, ఆదర్శ పత్నిగా ప్రేమించి-లాలించి-ఆరాధించి-లోలోన మురిసి ముగ్ధుడయేవాడు. శారద ఏం చక్కా ఎంత మంచిపిల్లా! ఎన్నో రాత్రులు శర్మ ఈ భావాలు ఎన్నో మధురంగా నటించు కొనేవాడు. కాలప్రవాహంలో సంవత్సరాలు నెలలుగా, నెలలు రోజుల్లా దొర్లిపోతున్నాయి. శర్మ చికాకులోకి మధ్య దండయాత్రలు లేకుండా నెట్టుకొచ్చాడు. శారద కాపురానికి వచ్చింది.

కార్డు వెనకాల, శర్మను శారదను సంక్రాంతి పండుగకు తీసుకువెళ్ళటానికని శాస్త్రిగారు చక్కా వచ్చారు. భోజనాలనంతరము అబ్బాయిని, కోడ లిని తీసుకువెళ్ళి పదిరోజులపాటు ఉంచుకొని పంపుతామని శాస్త్రిగారు చెప్పారు. నా అభ్యం తరం ఏమీలేదన్నట్లు రామారావుగారు శర్మవైపు చూశారు. శర్మకు ఏమిటో మామగారినుంచి వాచీ రాబట్టాలనే ఊహ కలిగింది. ఇదే మంచి తరుణం అని కూడా గ్రహించాడు.

మానవుడికి కోరికలుండటం సహజం. ఆ కోరికలు నెరవేరేదాకా సంకల్పసిద్ధితో, కసిగా ప్రయత్నం చేయడంకూడా కద్దు. కాదంటే కొందరు గమ్యం చేరటానికి నేరుగా బాటుంటపోతారు. మరికొందరు సూక్ష్మంలో మోక్షం అన్నట్లు దగ్గరదారులవెంట గమ్యం చేరుతారు. అసలు దీనినే డిప్లొమసీ అంటారేమో!

నాన్నవచ్చారన్న సంతోషంతోనూ, పుట్టింటికి వెళ్ళతాము అనే ఆనందం ఉత్సాహముతో, శారద మర్నాడు ఉదయం పెందలకడనే లేచి, ముస్తాబు అదీ మరీ పనిలోకి దిగింది. చురుకుగా కాఫీ తయారుచేసింది. పొగలు గ్రక్కుతున్న కాఫీకప్పు ఖాళీచేసి, శర్మవైపు శాస్త్రిగారు ప్రశ్నార్థకంగా చూపులు ప్రసరించారు. ఆ చూపుల అంతర్యం శర్మకు తెలియకపోలేదు.

"ఏమోయి, మరి మధ్యాహ్నం బండికి ప్రయాణం. నీ బట్టలు ఏవి వేయాలో చెపితే, అమ్మాయి దానిపెట్టెలో వేసి సర్దుతుంది" అన్నారు శాస్త్రిగారు. శర్మకు కాళ్ళముందర బంధాలువేస్తు న్నట్లు అనిపించింది.

"అబ్బే నేను రావడానికి వీలుండదు. పరీక్షలు దగ్గరకువస్తున్నాయి. పైగా కాలేజీ పోతుంది" అన్నాడు శర్మ.

ఇంతలోకీ పెరటిలో పనిపూర్తిచేసుకొని సుంద రమ్మగారు హాలులోకి వచ్చారు. శర్మ సమాధానం ఆవిడ వినకపోలేదు.

"తప్పురా నాయనా, ఎంత తప్పు. సరదాగా పండుగకి రమ్మంటే రాననడం మూర్ఖంగా ఉంటుం దిరా పెద్దాడా!" అన్నది సుందరమ్మగారు న్యాయాన్ని త్రాసులో తూచి మాట్లాడినట్లు. మాటలోమాట అందుకొని రామారావుగారు "కుర్ర మొఖం, వాడికేమి తెలుసులెండి. అలాగే వస్తాడు" అన్నారు బాధ్యతనంతా వెళ్ళబోస్తూ.

శర్మ డ్రాయింగురూములో తలుపుచెంత వారగా నుంచుని, క్రీగంటి చూపులు ప్రసారిస్తూ, శారద ఆ సంభాషణలు అన్నీ వింటూనే ఉంది కౌతుకంతో. శర్మకు ఏమిచేయాలో తెలియక శూన్యంలోకి చూస్తూన్నాడు—మూలకూర్చున్న ముసలమ్మగారి ముసుగు చూస్తూ. "మనుమడు వాచీకోసం అలక చేస్తూన్నాడండీ తమ్ముడుగారూ" అంది ఆవిడ. దానితో శర్మకు హిమాలయ పర్వతాన్ని నెత్తి మీదనుంచి దింపినంత రిలీఫ్ ఫీలయ్యాడు. మామ్మకు ఒక పద్మవిభూషణ తీన్‌రావర్డు ఇవ్వాలన్నంత సంతోషం వచ్చింది శర్మకు.

"ఏదో నలుగురు ఆడపిల్లలు కలవాడిని. వాచీ ఇచ్చేశక్తి నాకులేదు. ఒకళ్ళకిస్తే అందరికీ ఇవ్వాలి. నలుగురు పిల్లలూ నాల్గు కళ్లు నాకు. ఏదో మృష్టాన్నం మెతుకులతో మాతోపాటే"అన్నారు శాస్త్రిగారు.

కృష్ణశాస్త్రిగారు పంథా అంతా అదోక రకం. అయనది మనస్సుకు పట్టని ఆధ్యాత్మికం జీవిత కలాపంలో హృదయాన్నంటని రాగాలాపన అయన వైఖరి. ఇహాన్నిదాటి ఆముష్మికంగా ఈ మాత్రం—అందులోనూ అల్లుడు అలకమన్నించ లేడా తన మామగారు అని తర్కించుకున్నారు విద్యాధికుడైన శర్మ.

తన కోరికను కాల దన్నిన మామగారు పరీక్ష హాలులో కాపీ చేస్తున్న విద్యార్థిని పట్టుకొనే వాచరులా అగుపించారు. భోజనాలు పెందలకడే అయిపోయినాయి ప్రమాణం మూలాన్ని శారద తమలపాకులకు సున్నం వ్రాసి, వక్కపొడి చేతి కందిస్తూ, అతుల ఈనెలూ వయ్యారంగా తీస్తూ తండ్రివద్దకువచ్చి నిలబడింది.

"ఏమేశారదా. మీ ఆయన రాడుట మరి నీ బట్టలు సర్దుకో మనం వెడదాము" అన్నారు శాస్త్రిగారు డిఫెన్సు వాదంలో ఓడిన ప్లీడరులా.

"మీ అల్లుడుగారు రాండీ, నేనూ రాను" అన్నది శారద. పొంగిపొర్లే ప్రేమాతిశయంతో శాస్త్రిగారికి గుక్క తిరగలేదు.

"అయినా నాన్నా ఆయన మొదటి సారి వచ్చినప్పుడు నీవు ఇచ్చిన జామారు పుచ్చుకో లేదూ? ఏదో చదువుకునేవాళ్ళ మూలాన్ని, వాచీ ఇవ్వాలన్నారు. కరకుగా నీవు ఇవ్వననడంతో అత్తయ్యగారికి వాళ్ళకు కూడా కోపంవచ్చింది. ఊళ్ళో కాలేజీ పెట్టుతారంటే కరణం కామ రాజుగారు చందాకువస్తే అర్థనూట పదహారులు నీవు ఇచ్చావా లేదా. ఒక వాచీ అయనకు ఇస్తే బావుంటుంది." అంది శారద కొంచెం ఉపన్యాస ధోరణిలో.

"నీ దగ్గర మర్యాద నేర్చుకోడానికి ట్యూషను చెప్పించుకుంటానులే" అన్నట్లు శారదవైపు శాస్త్రి గారు చూసారు. ఆ చూపుల చల్లదనం గ్రహించి, శారద పెట్టె సర్దడానికి అట్టే టైము పట్టలేదు.

శర్మ తన గదిలో వాలు కుర్చీలో కూర్చుని కూని రాగాలు కొట్టుతున్నాడు ఏమీ విననట్లుగా. శారద తమలపాకులు వక్కపొడి డబ్బాతీసుకొని శర్మగదిలోకి వెళ్ళి భళ్లున తలుపు వేసింది. శారద అమృత తుల్యమైన చిరునవ్వుల తరిపి వెన్నెలలు శర్మను ముగ్ధుడను చేసాయి. అలస్యంగా సమర్థిం చినా, అద్భుతంగా సమర్థించావు" అంటూ శారద ఇచ్చిన తమలపాకులు వేసుకొన్నాడు. ఆమెను దగ్గరకు తీసుకొని, గుండెలకు అద్దుకొని, ఆమె విశాల లలాట ఫలకంమీద ముద్దులు వర్షం కురిపిం చాడు. నందన వనాల సౌందర్య సంపదనూ, గులాబీల గుబాళింపు పరిమాళాన్నీ చవి చూసే వారిలా, వారిద్దరి హృదయాలూ పీలయినంత దగ్గర పడ్డాయి. గదిలో గోడకు తగల్చబడి ఉన్న శర్మ పెళ్ళిఫొటో "వాచీకోసం పేచీ శారద లాలోచీతో ఊడిపడిందన్నట్లుగా" చూపులు ప్రసరించింది. ★